ప్రజాశక్తి
ఆదివారం 7 జనవరి 2024 5 అనంతపురం



# నేడు పుట్టపర్తికి సుప్రీంకోర్టు మాజీ జడ్జి

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వి. రమణ పుట్టపర్తికి ఆదివారం రానున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. సుప్రీంకోర్టు మాజీన్యాయమూర్తి ఎన్.వి.రమణ తన కుటుంబంతో ఆదివారం సాయంత్రం 4:10 గంటలకు రోడ్డు మార్గాన బెంగళూరు నుంచి ప్రశాంతి నిలయానికి చేరుకోనున్నారు. ఈ మేరకు వారు బాబా మహాసమాధిని దర్శించుకుని ఆదివారం రాత్రి అక్కడే ప్రశాంతి నిలయంలోనే బస చేయనున్నారు. సోమవారం ఉదయం సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకుంటారు. అనంతరం 11 గంటలకు పుట్టపర్తి నుంచి బయలుదేరి బెంగళూరుకు వెళతారు. ఈ మేరకు కలెక్టరేట్‌నుంచి శనివారం ఒక ప్రకటన వెలువడింది.

## జెఎన్‌టియులో
# స్నాతకోత్సవ సంబరం

- 71 మందికి బంగారు పతకాలు
- 86142 డిగ్రీ పట్టాలు ప్రదానం
- హాజరైన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ప్రొఫెసర్ కె.బాలవీరారెడ్డి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. 2020-21, 2022-23 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించిన డిగ్రీలు ఒకేసారి కావడంతో పెద్దఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రావడంతో విశ్వవిద్యాలయ ఆవరణం కోలాహలంగా మారింది. ఎన్టీఆర్ ఆడిటోరియం హాలులో శనివారం ఉదయం స్నాతకోత్సవం ప్రారంభమై మధ్యాహ్ననికి ముగిసింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో హాజరవగా, ఢిల్లీ ఐఐటి మాజీ డైరెక్టరు ప్రొఫెసరు విఘ్నేశ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**'బాలవీరారెడ్డికి గౌరవ డాక్టరేట్**

విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసరు కె.బాలవీరారెడ్డి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 71 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. 68963 మందికి బ్యాచ్‌లర్ డిగ్రీ ప్రదానం చేశారు. 16914 మందికి ప్రొస్టుగ్రాడ్యుయేషన్, 265 మందికి పిహెచ్‌డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్య అన్నది సమాచార సంగ్రహణకే కాదని అన్నారు. 21 శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనే ఆలోచన విధానముండాలని సూచించారు. 'గొడుగు వర్షాన్ని ఆపలేదు...కాని వర్షంలో నిలబడేందుకు ఉపయోగపడుతుంది. ఆత్మవిశ్వాసం కూడా అన్నింటిలోనూ విజయాన్ని అందివ్వకపోవచ్చుగాని, సవాళ్లను ఎదుర్కొనేమనో ధైర్యాన్నిస్తుంది.'అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేసిన వ్యాఖ్యాలను అ సందర్భంగా ఉటంకించారు. విద్యార్థులు కూడా విజయాన్ని సాధించడం ఒక్కటే కాదు.సవాళ్లను ఎదుర్కొనే మనోధైర్యాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ముఖ్య అతిథి సత్యనారాయణరాజు మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఇంజనీర్లు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు. విజ్ఞానమంటే కేవలం కంప్యూటరు విద్య మాత్రమే కాదని అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ అన్ని విభాగాలు సమానాభివృద్ధి జరగాల్సి ఉందని చెప్పారు. స్నాతకోత్సవం అనంతరం విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన పరిపాలనా భవనాన్ని గవర్నర్ మీట నొక్కి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఛాన్సలర్ రంగ జనార్ధన్, రెక్టార్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్శిటీ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**దాసరి శాంతికి ఎనిమిది బంగారు పతకాలు**

అనంతపురం జెఎన్‌టియులో 2022-23 సివిల్ టాపర్‌గా దాసరి శాంతి నిలిచింది. ఈమె యూనివర్శిటీకి ఇచ్చిన బంగారు పతకంతోపాటు ఎండోమెంట్ పతకాలు కలిపి మొత్తం ఎనిమిది బంగారు పతకాలు సాధించింది. సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి చెందిన శాంతి తండ్రి ఎలక్ట్రికల్ పనిచేసి జీవనం సాగిస్తుంటాడు. ఐఎఎస్ చేయాలన్నది తన కల అని శాంతి ఈసందర్భంగా తెలిపింది.

**బోగినేని మేఘనకు నాలుగు బంగారు పతకాలు**

అనంతపురానికి చెందిన బోగినేని మేఘన నాలుగు బంగారు పతకాలు సాధించింది. అనంతపురం జెఎన్‌టియులోని బిటెక్‌లో సివిల్ టాపర్‌గా వచ్చిన మేఘనకు నాలుగు బంగారు పతకాలు వచ్చాయి. కళాశాల టాపర్ అయినందుకు యూనివర్శిటీ గోల్డ్ మెడల్ రాగా, తక్కిన మూడు ఎండోమెంట్ గోల్డ్‌మెడల్స్ దక్కాయి. 2021-22 సంవత్సరంలో టాపర్‌గా వచ్చినందుకు ఈ పతకాలు లభించాయి. ప్రస్తుతం ఎజి అడిట్‌లో పనిచేస్తున్నట్టు మేఘన తెలిపింది. సివిల్ సర్వెంట్‌గా పనిచేయాలన్నదే తన లక్ష్యమని మేఘన ఈ సందర్భంగా తెలిపింది.

**పేదరికాన్ని అధిగమించిన సంగీతకు బంగారు పతకం**

తండ్రి హోటల్‌లో చిరుద్యోగి, అత్యంత పేదరికం. అయినా చదువుపైనున్న శ్రద్ధతో సంగీత అనే విద్యార్థిని ఇసిఇలో బంగారు పతకాన్ని అందుకుంది. బలపనూరులో అవ్వ ఇంటి వద్ద ఉండి డే స్కాలర్‌గా వెలుతూ ఈ ఘనతను సాధించింది. తన కుటుంబానికున్న సమస్యలను చదువు ద్వారా అధిగమించాలన్న పట్టుదలతో చదివినట్టు సంగీత ఈసందర్భంగా తెలిపింది.



దాసరి శాంతి



మేఘన



సంగీత

# బెదిరింపులకు భయపడం...

- 24 గంటల నిరాహార దీక్షలో అంగన్వాడీలు
- ఎస్మాను ఖండించిన ప్రజాసంఘాలు
- బెదిరించడం మాని సమస్యలు పరిష్కరించండి
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



24 గంటల నిరాహార దీక్షలో అంగన్వాడీలు, నాయకులు



దీక్ష శిబిరంలోనే శనివారం రాత్రి నిద్రచేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేస్తుంటే ఎస్మా పేరుతో బెదిరిస్తే భయపడేది లేదని . వేతనాలు పెంచేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 26వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో శనివారం అంగన్వాడీలు 24 గంటల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన, చట్టబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది ఎస్మా ప్రయోగించడానికి జీవో తీసుకురావటం ప్రభుత్వ దమన నీతికి నిదర్శనం అన్నారు. దీన్ని బట్టి చూస్తే అంగన్వాడీల ఉద్యమానికి ప్రభుత్వం ఎంతగా భయపడుతుందో అర్థమవుతోందన్నారు. ఉద్యోగులు, కార్మికుల పోరాటాలపై ఎస్మాను ప్రయోగించిన ముఖ్యమంత్రులందరూ అధికారాన్ని కోల్పోయారని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆ జాబితాలో చేరేందుకు సిద్ధ పడాలని హెచ్చరించారు. ఏ ఒక్క అంగన్‌వాడీ కూడా ప్రభుత్వ బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అంగన్‌వాడీల ఉద్యమానికి కావాల్సిన ప్రజా మద్దతు కూడగట్టడానికి తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. రాష్ట్రంలో 6 నెలలు సమ్మెలను నిషేధిస్తూ జగన్ ప్రభుత్వం ఇచ్చిన అదేశాల పట్ల ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, శకుంతల, రమాదేవి, జమున మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి అధికారం రెండు నెలలే ఉండగా 6 నెలల ఆదేశాలను ఎలా ఇచ్చారని ఎద్దేవాచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్‌వాడీ డిమాండ్ల పరిష్కరించడం మినహా మరొక మార్గం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంలో దీక్షా శిబిరం నుంచి వెళుతున్న గవర్నర్ కాన్వాయ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వానికి తమ బాధలు వినిపించేందుకు జోక్యం చేసుకోవాలని నినాదాలు చేశారు. అక్రమంగా తీసుకొచ్చిన జీవో 2 ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ 24 గంటల దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కోశాధికారి జమున, తిప్పిరమ్మ, నాగేశ్వరమ్మ, రామాంజనమ్మ, మేరీ, పి.లక్ష్మి, పంకజి తదితరులు దీక్షలు చేపట్టారు. వీరికి మద్దతుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నిల రామాంజనేయులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ, భాగ్యమ్మ, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, ఎమ్మార్పిఎస్ నాయకులు కేపీ.మధు, తదితరులు మద్దతుగా మాట్లాడారు. ఈసందర్భంగా అంగన్వాడీలు దీక్ష శిబిరంలోనే శనివారం రాత్రి నిద్రించారు.

**ఎస్మాను ఖండించిన ప్రజా కార్మిక రైతు సంఘాలు**

అంగన్‌వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని కార్మిక, ప్రజా, రైతు, మహిళా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. హక్కులు అమలు చేయమంటే ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని ఆయా సంఘాల నాయకులు అన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముత్తుజా, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రామాంజినేయులు తదితరులు ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు.

## అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగం నియంతృత్వం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

అంగన్వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ జీవో 2 ను జారీ చేయడం రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ వైఖరికి నిదర్శనంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించడాన్ని సిపిఎం జిల్లా కమిటి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ జీవో 2 ను తక్షణమే ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. 26 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న అంగన్వాడీలను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేదించడం దుర్మార్గంగా ఉందన్నారు. క్రూరచట్టాల ద్వారా అణచి వేయాలని చూడడాన్ని ప్రజాతంత్రవాదులందరూ ఖండించాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడంతోనే సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందకు ఎమర్జెన్సీ కాలం నాటి నల్లచట్టాన్ని (ఎస్మాను) అంగన్వాడీలపై ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సమె నిషేధించడంతో పాటు, సమ్మె కాలానికి వేతనాల్లో కోత విధించడం అత్యంత దుర్మార్గంగా ఉందన్నారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యల ద్వారా విచ్ఛిన్నం చేయాలనుకోవడం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో నడుస్తూ ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తోందన్నారు. ఇలాంటి వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలా కాదని మొండిగా వ్యవహరిస్తే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

## యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆత్మకూరు :** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ, క్యాలెండర్‌ను ఎంఇఒ నరసింహారెడ్డి శనివారం మండలంలోని బి.యాలేరు జిల్లా పరిషత్ స్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నరసింహారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, మండల అధ్యక్షుడు వెంకట నాయుడు, ఉపాధ్యక్షురాలు సరళ, మండల ప్రధాన కార్యదర్శి సాదిక్ ఖాన్, మండల కౌన్సిలర్లు రేవతి, తులసి, ఉపాధ్యాయులు నరహరి రమణారెడ్డి, నాగమల్లేశ్వర్ రెడ్డి, లక్ష్మీదేవి, రజియా, ఆదిలక్ష్మి, పిడి సునీత తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు విరాళం

**నార్పల :** సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెకు ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం నాయకులు శనివారం విరాళం అందజేశారు. ఇందులో భాగంగా మండలంలోని కేసేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ.5116ను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కేశేపల్లి ప్రధానోపాధ్యాయులు జయరామిరెడ్డి, యూనియన్ మండల అధ్యక్షులు శ్రీనివాసనాయక్, ప్రధాన కార్యదర్శి ఎన్.రవి, ఆర్థిక కార్యదర్శి మురళీమోహన్, మండల మహిళా కన్వీనర్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన డిఐజి, ఎస్పీ

**అనంతపురం క్రైం :** జిల్లా పర్యటనకు విచ్చేసిన గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్‌ను అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి, ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ శనివారం స్థానిక జెఎన్‌టియు అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛాలు అందజేశారు.



గవర్నర్‌కు బొకే అందజేస్తున్న డిఐజి

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

### పట్టు శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**



మాట్లాడుతున్న పట్టు శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు

పట్టు రైతులు ప్రభుత్వం అందించే అన్నిరకాల సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో నడవాలని పట్టు శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు సూచించారు. శనివారం వజ్రకరూరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో పట్టు శాఖ ఆధ్వర్యంలో రైతులు, సంబంధిత అధికారులకు వైఎస్ఆర్ పట్టుబడి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టు పురుగుల పెంపకంలో పాటించాల్సిన మెలకువలు, నూతన యాజమాన్య పద్ధతులను వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కొత్తగా రైతులు పట్టుపురుగులు పెంపకం చేపట్టాలన్నారు. పట్టు రైతులకు ప్రభుత్వం అందించే వివిధ విభాగాల్లో సబ్సిడీ రూపంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, జనరల్ కేటగిరిలో 70 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు వివరించారు. పట్టు రైతులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పట్టు రైతులకు ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి మున్నా, పట్టు శాఖ అధికారి ఓబులేసు, సిరికల్చర్ అసిస్టెంట్లు వన్నప్ప, సురేష్, ఉష, లక్ష్మీదేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం క్రూరత్వం : సిఐటియు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో-2 జారీ చేయడం క్రూరత్వానికి నిదర్శనమని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్వాడీలు 26 రోజులుగా సమ్మె చేపడితే సమస్యలు పరిష్కరించకపోగా ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకొచ్చి సమ్మెను నిషేధించడం ప్రభుత్వ నియంతృత్వ దోరణికి అద్దం పడుతోందన్నారు. ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం ఖాతరు చేయని రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను అణచివేయాలని చూస్తోందన్నారు. అంతేగాకుండా సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం అత్యంత దుర్మార్గమన్నారు. సిఎం జగన్ కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ అడుగుజాడల్లో నడుస్తున్నాడన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ఎత్తివేసి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-శింగనమల**

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం సమావేశం హాలులో ఎంపిపి యోగేశ్వరి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశం తూతూమంత్రంగా సాదింది. సమావేశం 11:30 ప్రారంభం కేవలం నలుగురు సర్పంచులు, ఆరుగురు ఎంపిటిసిలు, కొందరు అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో అధికారులు కొద్దిసేపు ఉండి మమా అనిపించారు. కాగా గ్రామాల్లోని సమస్యలపై చర్చించి పరిష్కరించాల్సిన సమావేశాలను ఇలా తూతూమంత్రంగా నిర్వహించడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమావేశంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, ఇఒఆర్‌డి మురళీకృష్ణ, ఎంపిపి యోగేశ్వరి, వైస్ ఎంపిపి విజయ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి, అగ్రికల్చర్ ఎంపిఇఒ అక్కమ్మ, సర్పంచులు దేగల లలితమ్మ, తరిమెల రాజారామిమోహన్‌రెడ్డి, ఎంపిటిసిలు మొరార్జీ, గోపాల్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, చిన్నజయన్న పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించేంత వరకూ సమ్మె

## 'శ్రీరామిరెడ్డి' కార్మికుల ఆందోళన

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం**

నాలుగు నెలలుగా బకాయి పడ్డ వేతనాలు చెల్లించేంత వరకూ సమ్మె కొనసాగించి తీరుతామని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు స్పష్టం చేశారు. వేతనాలు చెల్లించాలని శ్రీరామిరెడ్డి కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ వేతనాలు చెల్లించాలని అటు అధికారులు, ఇటు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. గతంలో చర్చల పేర పిలిపించి హామీ ఇచ్చినా వేతనాలు రాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వన్నూరుస్వామి, రుద్రప్ప, తిమ్మప్ప, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న శ్రీరామిరెడ్డి కార్మికులు

## టిడిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం అర్బన్ నియోజకవర్గం నారాయణపురం పంచాయతీకి చెందిన పలు పార్టీల కార్యకర్తలు, ప్రజలు శనివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక ప్రభుత్వాన్ని పార ద్రోలడానికి కలిసివచ్చే అందరినీ పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రామాంజనేయులు, చంటి, ఆంజనేయులు, అల్లా బకష్, గంగరాజు, హరి కుమార్, ఆదినారాయణ, భీమ లింగప్ప, అభిలాష్, నాగరాజు, హరి, మహేష్ కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు దేవళ్ల మురళి, డిష్ నాగరాజు, ముక్తియార్, అజీజ్, జేయం బాషా, నగర మహిళా అధ్యక్షురాలు విజయ శ్రీ రెడ్డి, వెంకటలక్ష్మి, శిరసాల రాంబాబు పాల్గొన్నారు.

**టిడిపి రాష్ట్ర రజక సాధికారిక కమిటీ సభ్యులుగా శోభ**

టిడిపి రాష్ట్ర రజక సాధికారిక కమిటీ సభ్యురాలుగా శోభను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి శోభాకు నియామకపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, హసీనా, సుజాత పాల్గొన్నారు.

## నేడు సామాజిక సాధికార బస్సుయాత్ర

**ఉరవకొండ :** సామాజిక సాధికార బస్సుయాత్ర ఆదివారం పట్టణంలో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా మధ్యాహ్నం సత్యం కన్వెన్షన్ హాల్లో పలువురు సామాజిక సేవకులు, మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులతో ముఖాముఖి ఉంటుందన్నారు. 3 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి బస్సుయాత్ర ప్రారంభమై అంబేద్కర్ సర్కిల్ వరకూ కొనసాగుతుందన్నారు. కావున వైసిపి ప్రజాప్రతినిధులు, రాష్ట్ర డైరెక్టర్లు, వివిధ విభాగాల కమిటీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

## జీవో 110 అమలు చేయాలి

### రాష్ట్ర ఉన్నత విద్య ఛైర్మన్ హేమచంద్రారెడ్డికి వినతి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**



హేమచంద్రారెడ్డితో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు 110 జీఓ అమలు చేయాలని ఎస్‌కెయు ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. ఈమేరకు శనివారం జెఎన్‌టియు స్నాకోత్సవానికి హాజరైన రాష్ట్ర ఉన్నత విద్య ఛైర్మన్ హేమచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఎస్‌కెయులో గంటకు రూ.500కు పని చేస్తున్నామన్నారు. ఈ లెక్కన ఒక్కోసారి కనీసం నెలకు రూ.5 వేలు జీతం కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో డాక్టరేట్, పోస్ట్ డాక్టరేట్ చదువులు చదివిన మాకు చాలి చాలని జీతంతో రోజు వారి పూట గడవడం కూడా కష్టమైందన్నారు. ఎలాగైనా తగు నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు హేమచంద్రారెడ్డి స్పందిస్తూ ఎస్కే యూనివర్శిటీ అధికారులతో మాట్లాడి మీకు న్యాయం జరిగేలా చూస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌హుస్సేన్, జయచంద్రరెడ్డి, వీర్రాజు, శివారెడ్డి, ఆదిశేఖర్‌రెడ్డి, సురేష్ రెడ్డి, ముత్యాలు, సాకె రాజు, నాగేంద్ర, గురుమూర్తి, రాంప్రసాద్‌రెడ్డి, గోపాల్, వేంకటరామిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

## 'అనంత'లో కార్మికుల శీర్షాసనాలు -తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో చెత్త వేసి నిరసన


అనంతపురంలో తలకిందులుగా నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు


తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో చెత్త వేసి నిరసన తెలుపుతున్న కార్మికులు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో కార్మికులు తలకిందులుగా నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. వీరి సమ్మెకు సంఘీభావం తెలిపిన సిపిఎం 1వ పట్టణ కార్యదర్శి రామిరెడ్డి, 2వ పట్టణ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ కార్మికులు 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం బాధాకరమన్నారు. అంతేగాకుండా కార్మికుల సమ్మెను నీరుగార్చేందుకు అధికారులు రూ.లక్షలు వెచ్చించి జెసిబిలు, ట్రాక్టర్ల ద్వారా శుభ్రం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి అనవసర వాటికి ఉపయోగించే నిధులను కార్మికుల సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. కార్మికులు తమ ప్రాణాలకు తెగించి ప్రజాసేవే పరమావధిగా పని చేస్తున్నా పట్టించుకునేవారే కరువవడం చాలా బాధాకరమన్నారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన 1వ పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ, 2వ పట్టణ కార్యదర్శి ముర్తుజా, ఆవాజ్ సభ్యులు వలి ముష్కిన్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నల్లప్ప, ఇంజనీరింగ్ నాయకులు పోతులయ్య, మురళి, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్, లక్ష్మీ నరసమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**తాడిపత్రి :** సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లిమున్సిపల్ కార్యాలయంలో చెత్తాచెదారం వేసి నిరసన తెలిపారు. అయితే పోలీసులు మున్సిపల్ కార్యాలయం గేట్లు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కార్మిక నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎట్లకేలకూ కార్మికులు కార్యాలయంలోకి చేరుకుని చెత్తాచెదారాన్ని వేసి బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల కడుపు కొడుతూ చెత్త తరలింపుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం సరైంది కాదన్నారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ రవి స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజారోగ్యం దృష్ట్యా చెత్త తరలింపు చేయాల్సి వచ్చింది తప్ప కార్మికులను ఇబ్బంది పెట్టడం తన ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు.


తాడిపత్రిలో అధికారులతో వాగ్వివాదం చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

**రాయదుర్గం :** మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా తమ సమస్యలు పరిష్కరించేందుకు సిఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ పట్టణంలోని మెయిన్ బజార్ కూడలిలో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

**గుత్తి :** సమస్యలు పరిష్కరించాలని గుత్తిలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇందులో భాగంగా ప్రధాన గేటును మూసివేసి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు. మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, మున్సిపల్ పారిశుద్ధ కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజినేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు బేడల నాగేంద్ర, ఈశ్వరయ్య, కె.ఆంజనేయులు, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్. రాజా,ఉపాధ్యక్షుడు ఎస్ఎ. మురళి, కార్యదర్శి రవిశంకర్, కోశాధికారి నక్కా శేఖర్, సహాయ కార్యదర్శి నరసింహ, నాయకులు రాజ్ కుమార్, ఓబులేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**గుంతకల్లు :** న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు శిబిరం వద్దే వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు కె.నరసయ్య నాయకత్వంలో చేపట్టిన వంటావార్పులో కార్మిక నాయకుల అభ్యర్థన మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కార్మికులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కార్యదర్శి జగదీష్, నాయకులు దాసు, మల్లేష్, సూరి, రాకెట్ల మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు


గుత్తిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

# తగ్గని అంగన్‌వా(వే)డీ

## జిల్లావ్యాప్తంగా కొనసాగిన సమ్మె

**ప్రజాశక్తి-విలేకరులు**

గుత్తిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం సోది చెప్పించుకుంటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి బి.రామకష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు పార్వతి, శారద, కళ్యాణి, బావమ్మ, శోభ, గంగ, తదితరులు పాల్గొన్నారు.గుమ్మఘట్టలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా సమ్మె చేయబట్టి 26రోజులు పూర్తయిన సందర్భంగా అంగన్వాడీలు 26 రూపంలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకురాళ్లు రుద్రమ్మ, మెహ్రూన్, చంద్రకళ, మల్లమ్మ, అంగన్వాడీలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు. పామిడి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా విద్యార్థులు సమ్మె శిబిరం వద్దకే వచ్చి చదువుకున్నారు. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జయంతి, మహాలక్ష్మి, నారాయణమ్మ, భారతి, జ్యోతి, యశోద, అనిత, తదితరులుపాల్గొన్నారు. పుట్లూరు మండల కేంద్రంలో అంగనవాడీలు చేపట్టిన సమ్మె శనివారం 26వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి సిపిఎం పుట్లూరు మండల కార్యదర్శి సూరి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగభూషణ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయలలిత, శశికళ, రమాదేవి, అనంతలక్ష్మి, అంగనవాడీలు పాల్గొన్నారు. బొమ్మనహాల్ మండలంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్వాడీలు మెడలకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మనహాల్, కణేకల్ మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు. శింగనమలలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు శనివారం సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెపై ఏస్మా ప్రయోగించడం చాలా బాధాకరమన్నారు. వెంటనే ఎస్మాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుంకన్న, అధ్యక్షులు రామాంజనేయులు, ఎర్రిస్వామి, ఆంజనేయులు, రైతుసంఘం సహాయ కార్యదర్శులు శ్రీనివాసులు, ఓబిరెడ్డి, వెంకటస్వామి, రమణమ్మ, ప్రమీల, భారతి, తదితరులు పాల్గొన్నారు. ఉరవకొండతోపాటు విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. వీరి సమ్మెకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలపై వెంటనే ఎస్మాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉరవకొండలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట అంగన్వాడీలు మౌనం పాటించారు. అనంతరం ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, శ్వేత, సరోజమ్మ, రామాంజనమ్మ, భాగ్యమ్మ, లోకమ్మ, శశికళ, నాగవేణి, మునెమ్మ, శివశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా శనివారం సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రేష్మ, గంగ, నాయకురాళ్లు నాగమణి, జూలీ, పార్వతి, మేరీ, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, నాయకులు తిమ్మప్ప, సురేంద్ర పాల్గొన్నారు.

పెద్దవడుగూరుకు వస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాన్వాయ్‌కి అంగన్వాడీలు అడ్డుగా నిలబడుకుని నిరసన తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే కారును అడ్డుకోబోగా పోలీసులు అడ్డుకున్నారు.


బొమ్మనహాల్‌లో ఉరేసుకుంటూ నిరసన


పెద్దవడుగూరులో ఎమ్మెల్యే కాన్వాయ్ ముందు నినాదాలు


పామిడిలో శిబిరం వద్దకే వచ్చిన చిన్నారులు


ఉరవకొండలో గాంధీ విగ్రహం ముందు మౌనం

## నార్పల రాజేశ్వరికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రాజేశ్వరి

**నార్పల :** మండల కేంద్రానికి రాజేశ్వరి శనివారం అనంతపురంలోని జెఎన్‌టియులో జరిగిన స్నాతకోత్సవ వేడుకల్లో డాక్టరేట్ అందుకుంది. మండలంలోని బి.పప్పూరు సచివాలయంలో పని చేస్తున్న రాజేశ్వరి జెఎన్‌టియు పరిధిలోని కలికిరిలో కెమిస్ట్రీ ప్రొఫెసర్ సరిత వద్ద 'డెవలప్‌మెంట్ అండ్ వ్యాలిడేషన్ ఆఫ్ కాంబినేషనల్ డ్రగ్స్ బై ఆర్‌పి-హెచ్‌పిఎల్‌సి టెక్నిక్స్' అనే అంశంపై రీసెర్చ్ చేసింది. ఈ ప్రయోగానికి స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టరేట్ రావడంతో రాజేశ్వరితోపాటుపా భర్త దివాకర్‌రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, బంధువులు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేకంగా అభినందించారు.

## రంగస్థల కళాకారుడికి నివాళి


నంజుండప్ప (పాతచిత్రం)

**అనంతపురం :** ఇటీవల సీనియర్ రంగస్థల కళాకారుడు పి.నంజుండప్ప (76) అనారోగ్యంతో కన్నుమూయడంతో పలువురు కళాకారులు శనివారం అంజళి ఘటించారు. వృత్తి రీత్యా వాణిజ్య పన్నుల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన నంజుండప్ప ఎన్నో నాటకాలు వేశారు. ఇందులో భాగంగా నగరంలోని లలిత కళా పరిషత్ కళాకారులతో కలిసి ఎన్నో నాటకాల్లో పలు పాత్రలు పోషించారు. ముఖ్యంగా ద్రోణుడి పాత్రకు ఆయన పెట్టింది పేరు. నంజుండప్ప కళారంగానికి చేసిన సేవలను స్మరిస్తూ, జనప్రియ, కవి ఏలూరు యంగన్న, ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు సి.రాము, రమేష్, చెన్నారెడ్డి, మురళి, కొండన్న, పట్నం శివప్రసాద్, శివరామిరెడ్డి, తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**అనంతపురం :** భారత్ ప్రభుత్వం రూపొందించిన క్యాలెండర్‌ను సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉప సంచాలకులు ఎస్.ఎ.కోరి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ సతీశ్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, కురుబ జయమారుతి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్.ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు రాఘవేంద్ర, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

**ఉరవకొండ :** డిసెంబర్ 23న జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు విశిష్టతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు శనివారం బహుమలతోపాటు ప్రశంసాపత్రం, బంగారు పథకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, ఇంటర్ ఉమ్మడి కళాశాల ప్రిన్సిపల్ మమత, ఒకేషనల్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఖాదర్, వజ్రకరూరు మండల ఎంఇఒ ఎర్రిస్వామి, వజ్రకరూరు హైస్కూల్ ప్రిన్సిపల్ కృష్ణానాయక్, శంకర్, విజయలక్ష్మి, ఎవిఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ విక్రమ్, మహేశ్వరి, ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## మీసాల నారాయణస్వామి బీసీవైపిలో చేరిక

**ప్రజాశక్తి-తాడిపత్రి**


బీసీవై పార్టీ కండువా కప్పుకుంటున్న మీసాల నారాయణస్వామి

విద్యావేత్త, యువ నాయకుడు మీసాల నారాయణ స్వామి శనివారం బీసీవై పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈమేర కు జిల్లా సమన్వయ సారథి డాఖా రాజుయాదవ్ ఆధ్వర్యం లో మీసాల నారాయణస్వామి తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భం గా మీసాల నారాయణస్వామి మాట్లాడుతూ రామచంద్రయాదవ్ స్థాపించిన బిసివై పార్టీ సిద్ధాంతాలతోపాటు మేనిపెస్టోకు ఆకర్శితై పార్టీలో చేరామన్నారు. ఆయన సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంద మనోహర్‌నాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, రంగనాథ్, రత్నాకర్, కృష్ణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 'ఐఎన్‌టిఎస్‌ఒ' ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయదుందుభి


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధ్యాపకులు

**ప్రజాశక్తి-అనంతపురం**

గత డిసెంబర్‌లో నిర్వహించిన ఐఎన్‌టిఎస్‌ఒ ఒలింపియాడ్ పరీక్షల ఫలితాల్లో అనంతపురం జోన్‌కు చెందిన శ్రీచైతన్య విద్యార్థులు అత్యధిక సెలెక్షన్లతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారని విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఖచ్చితమైన పాఠ్య ప్రణాళిక, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధమైన శిక్షణ ఇవ్వడం వల్లే విద్యార్థులు మంచి ప్రతిభ కనపరచి రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపళ్లు విశ్వనాథ్, తబస్సుం, వెంకటేష్, సమీనాఖాన్, కలందర్, పర్వీన్‌భాను, నేత్రావతి, శాంత, శ్రీదేవి, ఇర్షాద్, ఈరేష్, రాజేష్, నారాయణస్వామి, బాబు, సత్యనారాయణ, హరిత, నవీన్, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, రోహిణీ, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణ్, డీన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### జనసేన జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్

**ప్రజాశక్తి-అనంతపురం**

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో నగరం కంపు కొడుతోందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులు సమ్మెలోకి వెళ్తే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనసేన ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## వైభవంగా పెన్నహోబిలేసుడి పల్లకి ఉత్సవం


స్వామివారిని ఊరేస్తున్న దృశ్యం

**ఉరవకొండ :** మండలంలో వెలసిన పెన్నఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి పల్లకి ఉత్సవం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

**కళ్యాణదుర్గం :** జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ప్రకటించిన 23 మండలాల్లో 1,475 పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎడి గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంతో అనుసంధానంగా షెడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలు, పశువైద్యశాలలు, ఉపాధి హామీ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

## చౌకదుణాలపై దాడులు

**అనంతపురం :** అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు జిల్లాలోని పలు దుకాణాల్లో అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అనంతపురంలోని రాజు కాలనీలో, పామిడి మండలం దేవరపల్లి, ఖాదర్‌పేట గ్రామాల్లో ఉన్న చౌక దుకాణాల్లో ఆకస్మింగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ఆయా దుకాణాల్లో రిజిస్టర్లు, పుస్తక నిల్వలు, భౌతిక నిల్వలను పరిశీలించారు. వ్యత్యాసాలు ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పి.శేషగిరి, ఎల్.రవీంద్రనాథ్, సిఎస్‌డిటిలు దుర్గప్రసాద్, జి.లక్ష్మినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

## 12వ పిఆర్‌సి కమిషన్ ఏం చేస్తోంది..?

### ఎపిఎస్ఇఎ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్

**ప్రజాశక్తి-అనంతపురం క్రైం**

రాష్ట్రంలో ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన 12వ పే రివిజన్ కమీషన్ ఏర్పాటు చేసి ఐదు నెలలు గుడుస్తున్నా ఉద్యోగులతో సమావేశాలుగానీ, జిల్లాల పర్యటనలుగానీ చేయకుండా ఏం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపిఎస్ఇఎ) రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉద్యోగులకు 2023 జూలై నుంచి 12వ పిఆర్‌సి అమలు చేయలేదన్నారు. ఇందుకోసం డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఛైర్మన్‌గా 2023 జూలైలో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అప్పటి నుంచి కమిటీ ఏం చేసిందో ఎవరికీ తెలియలేదన్నారు. కమిటీ కనీసం ఇప్పటి వరకూ ఉద్యోగ సంఘాల నేతలతో ఒక్క సమావేశం నిర్వహించిన పాపాన పోలేదన్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై ప్రభుత్వం దాటవేత ధోరణి మానుకోవాలని డిమాండ్ చేశారు.

### ప్రయివేటు ట్రాక్టర్ల వినియోగానికి నిరసనగా

## మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముట్టడి


కమిషనర్ చాంబర్ ముందు బైటాయించిన కార్మికులు, నాయకులు

**ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్**

నగరంలో 20 ట్రాక్టర్లను వినియోగించి చెత్త తరలించడాని నిరసిస్తూ శనివారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ చాంబర్‌ను ముట్టడించారు. కమిషనర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గవర్నర్ పర్యటన పేరుతో కాన్వాయ్ రూట్ లో పారిశుధ్య పనులు నిర్వహించారన్నారు. అయితే గవర్నర్ పర్యటన ముసుగు పేరుతో నగరంలో 20 కి పైగా ట్రాక్టర్లను వినియోగించి చెత్తను తరలించారని విమర్శించారు. కార్మికుల వేతనాల పెంపునకు చర్యలు చేపట్టకపోగా నిరవధిక సమ్మె సమయంలో లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి పోటీ కార్మికులు ప్రైవేటు ట్రాక్టర్లతో చెత్త తరలించడానికి చేపట్టటం కార్మిక ద్రోహమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు సమ్మె చేస్తుంటే అధికారులు ప్రైవేటు ట్రాక్టర్లతో చెత్త ఎలా తరలిస్తారని నిలదీశారు. దీనిపై కమిషనర్ కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కమిటీ కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు తిరుమలేష్, ఎర్రిస్వామి, వరలక్ష్మి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు

## పింఛన్ల పంపిణీ


అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం**

నగర సమీపంలోని ఎ.నారాయణపురంలో శనివారం పింఛన్ల పెంపు మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్ల మొత్తాన్ని రూ.3వేలకు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు నాగేంద్ర, శృతి, మాజీ సర్పంచి జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నేత రామసుబ్బారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు హాజీ, సత్తెన్న, వేణు, మురళీమోహన్, నాగార్జున, మనోజ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పెద్ద లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు :** మండల కేంద్రంలోని దివాకర్ కళ్యాణ మండపంలో పింఛన్ల పెంపు మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ హరినాథరెడ్డి, ఎంపిపి శ్రీదేవి, సర్పంచి వరలక్ష్మి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవర్ధనరెడ్డి, నాయకులు శరభారెడ్డి, చిదంబరరెడ్డి, వెంకటస్వామిగౌడ్, గద్దలగుట్టపల్లి హరినాథ్‌రెడ్డి, పాశం నాగరంగస్వామి, వేణు కృష్ణారెడ్డి, ఎంపిడిఒ కుళ్లాయిస్వామి, తహశీల్దార్ నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

**రాయదుర్గం :** పట్టణంలో పెంచిన పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. 11వ వార్డు సభ్యురాలు గౌని లావణ్య, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి గౌని శ్రీరామిరెడ్డి, కన్వీనర్ సత్యనారాయణ, రోజా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

**పామిడి :** మండలంలోని కొండాపురం గ్రామంలో మంజూరైన నూతన పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఎం.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, మునగల రంగనాయకులు, సత్య, ధనుంజయ, దస్తగిరి, మహిళా పోలీస్ పద్మావతి, వాలంటీర్లు నల్లప్ప, కోటేశ్వరయ్య, హరి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.


పామిడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

## నేరాలు ఘోరాలు

### హత్యకేసు నిందితుల అరెస్టు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, సిఐ శంకర్‌రెడ్డి

**తాడిపత్రి :** ఇటీవల పట్టణంలో జరిగిన యువకుడి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత కక్షల నేపథ్యంలో అరీఫ్‌ను హత్య చేసినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో శివాలయం ఆలయ ఏరియాలో నిందితులు బద్వేల్ రహంతుల్లా, బద్వేల్ మహమ్మద్ అయుఫ్, షేక్ సాదిక్‌వలి, బద్వేల్ షబ్బీర్, తోళ్ళ మాబు, షేక్ కలాంబాషా, నన్నే బచ్చే పటాన్, హాజ్‌బాషా, దూదేకుల మహమ్మద్, షేక్ చిన్న హాజీబాషాను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరి కొంతమంది పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితుల నుంచి నాలుగు వేట కొడవళ్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.